ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

ఎల్బీనగర్, జూలై 3: గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రజాపాలన దరఖాస్తుల డేటాను సరిదిద్దడానికి హయత్‌నగర్ సర్కిల్‌లోని నాలుగు డివిజన్లలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య బుధవారం తెలిపారు. నాగోలు డివిజన్ లలితానగర్ మోడల్ బిల్డింగ్‌లోని వార్డు పరిపాలనా కార్యాలయం, మన్సూరాబాద్ జడ్జస్ కాలనీలోని మోడల్ మార్కెట్ భవనంలోని వార్డు పాలనా భవనం, హయత్‌నగర్ గ్రామంలోని వార్డు పాలనా భవనం, బీఎన్‌రెడ్డినగర్ ఎన్జీవోస్‌కాలనీలోని మోడల్ మార్కెట్ భవనం వార్డు పాలనా కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని గృహజ్యోతి లబ్ధిదారులు సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తులు చేసిన డేటాను సరిదిద్దుకోవచ్చని తెలిపారు.

సరూర్‌నగర్ సర్కిల్‌లో..

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల పరిధిలో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారు ఆయా డివిజన్ల పరిధిలోని సేవా కేంద్రాల్లో డేటాను సరిదిద్దుకోవచ్చని ఉప కమిషనర్ సుజాత బుధవారం తెలిపారు. కొత్తపేట మహిళా భవన్‌లోని వార్డు పరిపాలనా భవనం, చైతన్యపురిలోని భవానినగర్ రోడ్ నంబర్ 10లోని భవానినగర్ కమ్యూనిటీ హాల్ వార్డు పరిపాలనా భవనం, గడ్డిఅన్నారం వివేకానందనగర్‌లోని బస్తీ దవాఖాన భవనం వార్డు పరిపాలన భవనం, రామకృష్ణాపురం ఖిల్లా మైసమ్మ ఆలయం వెనుక కృష్ణానగర్ కమ్యూనిటీ హాల్‌లోని వార్డు పరిపాలనా భవనం, సరూర్‌నగర్ మోడల్ మార్కెట్ భవనం వార్డు పరిపాలనా భవనంలో సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

రైతు బజార్ ఆధునీకరణకు కృషి

- గత ప్రభుత్వంలోనే రూ.4కోట్ల నిధులు మంజూరు
- ప్రస్తుత ప్రభుత్వం వెంటనే నిధులివ్వాలి
- చిరువ్యాపారులకు రైతు బజార్‌లోనే అవకాశం..
- ఆధునీకరణ కోసం ప్రతిపాధనలు సిద్ధం చేయాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మౌలిక సదుపాయల గురించి అధికారిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

ఆర్కేపురం, జూలై 3: సరూర్‌నగర్ రైతు బజార్ ఆధునీకరణకు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. రైతు బజార్‌ను గడ్డిఅన్నారం మార్కెట్ కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. రైతు బజార్‌లో రైతులను, వినియోగదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బజార్‌కు మంచి ఆదరణ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఉన్న షెడ్లను ఎత్తు పెంచి ఆధునీకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా మరుగు దొడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రైతుబజార్ ఆవరణలో చిరువ్యాపారులకు ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే ముందు ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని మొర పెట్టుకున్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ చిరుప్యాపారులు రైతు బజార్‌లోనే తమ సరుకును విక్రయించే విధంగా కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు సూచించారు.

మౌలిక వసతులపై ఆరా..

కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌ను అసిస్టెంట్ ఎస్సీ డెవలప్‌మెంట్ విభాగం అధికారి కుసుమ లావణ్యతో కలిసి పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే మాజీ సీఎం కేసీఆర్‌తో మాట్లాడి బీజేఆర్ భవన్ ఆధునీకరణ కోసం రూ.4కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆమె కోరారు. భవనంలో చేపట్టాల్సిన మౌలిక వసతులపై అంచనా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, మహేశ్వరం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్కేపురం అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, సరూర్‌నగర్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, ఆకుల అరవింద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ళ రామ్‌నర్సింహ, సిద్ధగోని వెంకటేశ్‌గౌడ్, శ్యామ్‌గుప్తా, రైతుబజార్ ఈఓ స్రవంతి, మహిళ అధ్యక్షురాలు లిక్కి ఊర్మిల, సాజీద్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, జగన్మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, కంచర్ల శేఖర్, సిరిపురం రాజేశ్‌గౌడ్, పుష్పలతారెడ్డి తదితరులు ఉన్నారు.

బహిరంగంగా చెత్త వేస్తే జరిమానా

వివేకానందనగర్ చౌరస్తాలో పారిశుధ్య సిబ్బందితో కలిసి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 3: వ్యర్థాలను చెత్త రిక్షా కార్మికులకే అందజేయాలని, బహిరంగంగా పడవేయరాదని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి కోరారు. గడ్డిఅన్నారం డివిజన్ వివేకానందనగర్ చౌరస్తాలో బహిరంగంగా చెత్తను పడవేస్తే జరిమానా విధిస్తామంటూ ఫ్లెక్సీలను పారిశుధ్య సిబ్బందితో కలిసి కార్పొరేటర్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రేం మాట్లాడుతూ పారిశుధ్యం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. చెత్తను బహిరంగంగా పడవేస్తే నగదు రూపంలో జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. చెత్త ఎవరు వేస్తున్నారన్నది సీసీ కెమెరాల ద్వారా తేటతెల్లం అవుతుందన్నారు. అదే విధంగా వీధి కుక్కలతో డివిజన్ పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడతున్నారని, వీధి కుక్కల సమస్యల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

ధ్యానాంజనేయ స్వామికి ఎమ్మెల్యేల పూజలు

కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

చంపాపేట, జూలై 3: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ బుధవారం సందర్శించారు. వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి పూర్ణకుంబంతో ఆలయంలోకి స్వాగతించారు. ఎమ్మెల్యే కుమారుని పెండ్లి పత్రికకు పూజలు జరిపించారు. దేవరకొండ ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల సందర్భంగా స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, మధుసాగర్, చీర తిరుమలేశ్, బిల్లకంటి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం మండల అభివృద్ధే లక్ష్యం

బడంగ్‌పేట్, జూలై 3: మహేశ్వరం మండలం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ.87.1లక్షలతో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించినట్లు చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా పరిషత్‌కు మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. మండలంలో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సునీత ఆంధ్యనాయక్, అన్రెడి సువర్ణ, రాయప్ప కుమారి తదితరులు ఉన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

ఇబ్బందులు కలుగకుండా పనులు

ఎన్జీవోస్‌కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 3: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు పూర్తిచేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎన్జీవోస్‌కాలనీలో జరుగుతున్న రోడ్డు పనుల వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎన్జీవోస్ కాలనీవాసులు బుధవారం కార్పొరేటర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో పనులు జరుగుతున్న స్థలాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉన్న సమస్యలను అధికారులు గుర్తించాలని సూచించారు. కాంట్రాక్టర్‌కు సరైన సూచనలు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జైపాల్‌రెడ్డి, న్యూటన్, శ్యామ్, శరత్‌కుమార్, కృష్ణ, మధు, కరుణాకర్, వికాస్, నరసింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, కళా చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీటీసీలకు వీడ్కోలు సమావేశం

కందుకూరు, జూలై 3: ఈ నెల 4న ఎంపీటీపీలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సరిత బుధవారం తెలిపారు. ఎంపీటీసీల పదవి కాలం ముగియడంతో మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఉదయం 11గంటలకు మండల పరిధిలోని 16మంది ఎంపీటీసీలకు సన్మానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సైదాబాద్, జూలై 3: ఆటో మొబైల్ మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ప్రపంచ మెకానిక్స్ డే సందర్భంగా బుధవారం ఆటో మొబైల్–మెకానిక్స్ టూ వీల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆటో మొబైల్ మెకానిక్‌లు గౌరవప్రదంగా జీవించటానికి ప్రభుత్వం మెరుగైన అవకాశాలను కల్పించాలని అన్నారు. వారి కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. వచ్చే ఏడాది అసోసియేషన్ కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించి, నిధులను మంజూరు చేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. తమ వృత్తితోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో సైతం భాగస్వాములు కావటం శుభసూచకమన్నారు. కష్టజీవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆమె పేర్కొన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. మెకానిక్‌లంతా ఐక్యంగా ఉండి సామాజిక సేవల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆటో మొబైల్–మెకానిక్స్ టూ వీల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ముకుందారెడ్డి, ఉపాధ్యక్షులు సతీశ్‌రెడ్డి, రమేశ్, బీరప్ప, శ్రీనివాస్, శ్రీశైలం, ప్రవీణ్, కృష్ణాయాదవ్, సైదులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

లా కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

చెరువును సుందరీకరించాలి

మార్నింగ్ వాక్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌తో కలిసి బైరమాల్‌గూడ చెరువును సందర్శిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూలై 3: చెరువు మురుగు నీటితో కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా వచ్చిన హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం జోనల్ కమిషనర్‌తో కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో పర్యటించారు. ఇందులో భాగంగా మొదటిగా చంపాపేట డివిజన్ పరిధిలోని బైరమాల్‌గూడ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఈ చెరువులో పూడిక తీసి మురుగు నీటితో కలుషితం కాకుండా అన్ని విధాల సుందరీకరించేందుకు ఓ కాంట్రాక్టర్ ముందుకొచ్చి కొంత వరకు పనులు నిర్వహించారని చెప్పారు. కేటాయించిన నిధులు సరిపోవడం లేదని పనులు చేసేందుకు నిరాకరించి వెళ్లడం జరిగిందని కమిషనర్‌కు వివరించారు. ఇప్పటికైనా చెరువులో పూడికతీయించి మురుగు నీటితో కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. చెరువు ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఇదే విధంగా చెరువులోకి వచ్చి చేరుతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు కార్మికుడిని నియమించాలన్నారు. లేదంటే చెరువులో చెత్త పేరుకుపోయి దురువాసన వెదజిమ్మే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, అధికారులు అశోక్‌రెడ్డి, పలు డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ జెడ్సీకి వివరిస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

రోడ్డు విస్తరణ చేపట్టాలి

మన్సూరాబాద్, జూలై 3: మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి బుధవారం పర్యటించారు. పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ కోసం బిగ్‌బజార్ నుంచి మన్సూరాబాద్ చౌరస్తా మీదుగా సుష్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని జెడ్సీని కార్పొరేటర్ కోరారు. కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్ల సంస్కృతి, వ్యాపార కేంద్రాల ఏర్పాటుతో ఆ మార్గంలో విపరీతంగా ట్రాఫిక్ పెరిగిపోయిందని తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం ఇప్పటికే బిల్డింగ్ యజమానులకు నోటీసులు ఇచ్చి మార్కింగ్ చేశారని చెప్పారు. నష్ట పరిహారం చెల్లించి వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ తప్పదు



యాదమ్మ సన్మాన సభలో పాల్గొన్న డాక్టర్ రేవతి, తదితరులు

కందుకూరు, జూలై 3: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరని కందుకూరు పశువైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. కందుకూరు పశువైద్యాశాలలో సబ్ ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న యాదమ్మ వీడ్కోలు సమావేశంలో పాల్గొని యాదమ్మను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సర్వీస్‌లో ఉండగా యాదమ్మ చేసిన సేవలు ఎవరూ మర్చిపోరని చెప్పారు. శేషజీవితంగా ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. లేమూరు, రాచులూరు పశువైద్యాధికారులు సంధ్యారాణి, ఎండీ సైన్ షేక్, జంగయ్య, అప్సర్, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు, జంగారెడ్డి, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా, గుండ్ర సుధాకర్ రెడ్డి, ఎడ్ల ఉదయ్, నర్సింహ, శ్రీనివాస్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్, జూలై 3: కాలనీల్లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా జీహెచ్ఎంసీ పారిశుధ్య నిర్వహణ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులేకుండా పనులను కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో వెంకట్‌రాజ్, శానిటేషన్ సూపర్‌వైజర్ గోవిందరెడ్డి, జవాన్ నర్సింగ్‌రావు, ఎస్ఎఫ్ఏలు చంద్రప్రసాద్, మహేందర్, ఫజల్, దేవేందర్, శ్రవణ్, రాంకీ ఇన్‌చార్జి దినేశ్ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

మలక్‌పేట, జూలై 3: నీట్, యూజీసీ నెట్ పరీక్ష పత్రాల లీకేజీతో నష్టపోయిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించటంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు ఎం.చైతన్య, ఆర్.బాలకృష్ణ ఆరోపించారు. విద్యారంగం, పరీక్షల నిర్వాహణపట్ల కేంద్రం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లో బుధవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దేవేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అనిల్‌కుమార్, వంశీ, రాహుల్, దశరథ్, అంజి, షేక్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు ఎం.చైతన్య, ఆర్.బాలకృష్ణ తదితరులు

అభివృద్ధిని పరుగులు పెట్టించిన జడ్పీటీసీ

జంగారెడ్డిని సన్మానిస్తున్న అనితారెడ్డి

కందుకూరు, జూలై 3: కందుకూరు మండల అభివృద్ధికి జడ్పీటీసీ జంగారెడ్డి ఎంతో కృషి చేసినట్లు రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు. ఆయన పదవికాలం ముగియడంతో శాలువాలు, పూలదండలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులను అభివృద్ధిలో పరుగులు పట్టించినట్లు పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవకు అంకితం కావాలని కోరారు. అభివృద్ధి, ఇంతటితో ఆగదని ఎంత చేసినా మిగిలి ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో మన ఊరు, మన బడి, డంపింగ్ యార్డు, శ్మశానవాటికలు, నర్సరీల ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రజలకు మరిన్ని సేవలందించాలన్నారు. మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గణేశ్, సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగారావులతో పాటు అధికారులు, ఇతర మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.